# స్వల్పకాలానికి బలహీనం

**సమీక్ష:** అంతక్రితం వారం ఆల్ టైం గరిష్ఠాలను చేరిన మార్కెట్ గత వారం విక్రయాల ఒత్తిళ్లలో చిక్కుకుంది. అధిక స్థాయిల నుంచి జారి ఏకంగా 848 పాయింట్లు కోల్పోయి 20156 వద్ద స్థిరపడింది. మార్కెట్ కు ప్రారంభం నుంచే ప్రతికూలతలు వెన్నాడాయి. బలహీన అంతర్జాతీయ మార్కెట్ల వల్ల అధిక స్థాయిల వద్ద మదుపర్లులాభాల స్వీకరణ చేయక తప్పింది కాదు. తర్వాత పవర్ గ్రిడ్ ఎఫ్‌పీఓ, చైనా దిగుమతుల గణాంకాలు, ఒబామా సందర్శనలో ఎలాంటి ఉత్సాహకర ప్రకటనలు లేకపోవడం వంటి కారణాల వల్ల మార్కెట్ కొద్ది పరిమితుల్లోనే కదలాడింది. అయితే చైనా వడ్డీ రేట్లను పెంచుతుందన్న భయాలు, యూరో జోన్ అస్థిరత్వం, బలహీన ఐఐపీ గణాంకాల వల్ల వారాంతంలో మార్కెట్ భారీ విక్రయాల బారిన పడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు(ఎఫ్ఐఐలు) తమ ధోరణిని కొనసాగిస్తూ రూ. 8562 కోట్ల మేర నికర కొనుగోళ్లు జరిపారు. మరో పక్క మ్యూచువల్ ఫండ్‌లు రూ. 826 కోట్ల విక్రయాలు జరిపాయి.

**రంగాల వారీగా:** ప్రధాన కంపెనీల ఫలితాలు అంచనాల కంటే తక్కువగా నమోదు కావడంతో వరుసగా రెండో వారమూ స్థిరాస్తి రంగంలో బలహీనతలు కొనసాగాయి. బ్యాంకింగ్ రంగంలో లాభాల స్వీకరణ జరిగింది. ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో మాత్రం కొనుగోళ్లు జరిగాయి.

శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:3గా ఉండడం చూస్తే మార్కెట్ అంతటా విక్రయాలు జరిగినట్లు కనిపిస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** మార్కెట్ ఇంట్రా డే గరిష్ఠ స్థాయిల్ని దాటడంలో విఫలం కావడంతో దిద్దుబాటు ధోరణి కొనసాగుతుందని అంచనా. సెన్సెక్స్‌కు 60 రోజుల చలన సగటు(డీఎమ్ఏ)19728 వద్ద బలమైన మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయి కిందకు మార్కెట్ పడిపోతే కనుక మరింత కుంగుబాటును అంచనా వేయొచ్చు. ఒక వేళ ఈ స్థాయి కంటే దిగువన వరుసగా రెండు రోజులు కనుక ముగిస్తే సెన్సెక్స్ 19,000 స్థాయిల వరకూ పతనం కావొచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** నేడు విడుదల కానున్న ద్రవ్యోల్బణం నెలవారీ గణాంకాలను మార్కెట్ దగ్గరగా పరిశీలించొచ్చు. ఇప్పటికే ఐఐపీ గణాంకాలు నిరుత్సాహ పరిచాయి కనుక ద్రవ్యోల్బణం తగ్గితే తప్ప మార్కెట్లో ఉత్సాహం రాదు. మరో పక్క పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలక బిల్లుల పరిణామాలు కూడా ప్రభావితం చేయొచ్చు. అంతర్జాతీయంగా ఐర్లాండ్ రుణ చెల్లింపుల విషయం, యూఎస్ పారిశ్రామికోత్పత్తి, నిరుద్యోగ గణాంకాల మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు.




**సెన్సెక్స్ విశ్లేషణ**
**నవంబరు 12తో ముగిసిన వారానికి**

**తక్షణ నిరోధ స్థాయిలు:** 20282, 20426, 20544;

**తక్షణ మద్దతు స్థాయిలు:** 19864, 19728, 19445

**స్వల్పకాలంలో మార్కెట్లో బలహీనతలు కొనసాగవచ్చు.**

–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్